## "మదర్స్ డే!" - by SKU

Back Home

ప్రతి సంవత్సరం, మే నెల తొమ్మిదవ తారీఖున Mother's Day ని జరుపుకుంటారు. నాకు అసలు ఈ మదర్స్ డే గురించి ఇండియా లో వున్నన్నాళ్ళూ తెలీదు. అక్కడ వాళ్ళకి కూడా ఈ Hallmark, Archies' వంటి గ్రీటింగ్ కార్డుల కంపెనీలు వచ్చి, వాటి సేల్స్ కోసం ఆ ఇంగ్లీషు వాడి పండగలని ప్రాచుర్యం చేసే దాకా తెలీదేమో! (కనీసం Valentine's Day గురించి నాకు వారి వలనే తెలిసింది!)

ఇండియా లోవుండగా వాలెంటైన్స్ డే గురించి తెల్సినా, మదర్స్ డే గురించి తెలియకపోవటం వలన, ఎప్పుడూ ఆ రోజు ఏం చేయాలి, అమ్మని ప్రత్యేకం గా ఎలా ఇంప్రెస్ చెయ్యాలి అన్నది తెలియదు!

కానీ ఇక్కడకి వచ్చాక, తెలిసింది. ఇక్కడ వాళ్ళు అమ్మని గుర్తుతెచ్చుకోవటానికి ఒక రోజు, అమ్మమ్మ ని గుర్తుతెచ్చుకోవటానికి ఒక రోజూ, నాన్న కి ఫోన్ చేసి మాట్లాడటానికి ఒక రోజూ ప్రత్యేకం గా ఏర్పర్చుకోవటం చూసి, మొదట్లో వెటకారం గా నవ్వుకున్నాను. అవును మరి.. అలా ఒక పేరు పెట్టుకొని కేలండర్ లో ఒక రోజు ని క్రాస్ చేసుకుంటే తప్ప వీళ్ళకి అమ్మ, నాన్న, తాతయ్యా, అమ్మమ్మ లు గుర్తు రారన్న మాట! అనుకున్నాను.

నా వెటకారాలూ, వేళాకోళాలూ, ఇక్కడి మనుష్యుల మీద నా అభిప్రాయాలూ ఎలా వున్నా, అక్కడ ఇండియా లో కూడా అలాగే జనాలు ఈ "డే" ల సంస్కృతికి అలవాటు పడ్డారని నాకు ఇక్కడకి వచ్చిన రెండో ఏడు తెలిసింది.

మామూలుగా ఇంటికి ఒక ఆదివారం ఫోన్ చేసాను. మా చిన్నది ఎత్తింది. మాటల్లో అడిగింది..
"రేపు మదర్స్ డే! గుర్తుందా? అమ్మకి ఫోన్ చేసి గ్రీటింగ్స్ చెప్పు!"

నాకు అర్థం కాలేదు. మా ఇంట్లో మామూలుగా నేను పుట్టిన రోజు మర్చిపోతూ వుంటాను. నా పుట్టిన రోజు కూడా నాకు గుర్తు వుండదు. దానికి కారణం మా ఇంట్లో అన్నీ తెలుగు కేలండర్ ప్రకారం చేసుకుంటాము. నాకు తెలుగు కేలండరు చూడటం రాదు. దానితో, ప్రతీ సంవత్సరం, అమ్మ, లేకపోతే ఎవరో ఒకళ్ళు నాకు ముందే చెప్తూ వుంటారు ఎవరి పుట్టినరోజులు ఎప్పుడు వస్తాయి, ఏ పండగ ఎప్పుడు వస్తుంది వగైరా. అదే విధంగా ఇది కూడా చెప్పింది మా సుజి.

"కొత్తగా ఇదేమిటీ?" అర్థం కాక అడిగాను. ఈ తరహా "డే" ల మీద అంతగా నమ్మకం లేని నేను!

"మన ఇంట్లో అద్దెకి వున్న వాళ్ళ అబ్బాయి వాళ్ళ అమ్మగారికి అక్కడ అమెరికా నుండి ఆర్డర్ చేసి పంపించిన పోచంపల్లి పట్టు చీర రేపు డెలివరీ ఇస్తారుట." వివరం చెప్పింది.

"ఓహో!" అనుకున్నాను. ఇప్పుడు నేను కూడా ప్రతీ సంవత్సరం ప్రతి రోజూ అమ్మ ని అనుక్షణం తలచుకున్నా, తలచుకోకపోయినా, ఈ పర్టిక్యులర్ రోజు మాత్రం మరవకుండా ఫోన్ చేసి విష్ చేయాల్సిన అవసరం వచ్చింది అని తెలిసింది. అమ్మ హృదయం చిన్నబుచ్చుకోకపోవచ్చు కానీ, అమ్మలక్కల మధ్య స్త్రీ హృదయం చిన్నబుచ్చుకోవచ్చు నేను ఈ రోజు ని మర్చిపోతే!!

ఇదెక్కడి బలవంతపు బ్రాహ్మణార్థం? నాకు ఈ జన్మ నిచ్చి, సంస్కారం నేర్పి ఈ రోజు నేను ఏమైనా

ఒక స్థాయిలో వుండి వుంటే దానికి కారణం అయిన అమ్మని రోజూ, ప్రతీ క్షణం గుర్తు వుంచుకున్నా వుంచుకోకపోయినా ఆ రోజు మర్చిపోకూడాదా?!

మా అమ్మ మీద నాకున్న గౌరవం కానీ కృతజ్ఞత కానీ వ్యక్తపరచటానికి నాకు ఒక్క రోజు సరిపోదు! అలాగే, ఆ ఒక్క రోజూ నేను అమ్మకి ఫోన్ చేయటం మర్చిపోతే, అమ్మ పట్ల నా ప్రేమా తగ్గదు!

---

మీ సలహాలు, సూచనలు రచయిత్రి SKU కి తెలియపరచండి.